www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 8 ఫిబ్రవరి 2025



'విద్యార్థులు బాగా చదువుకోవాలి'

తణుకు : విద్యార్థులు బాగా చదువుకొని భావి భారత పౌరులుగా ఎదగాలని ప్యానెల్ న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ నెం.14, సజ్జాపురం ప్రాంగణంలో వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా చైర్మన్, నల్లజర్ల అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్, సిడిపిఒ ప్రమదిని మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు అందరూ చదువుకోవాలని, ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తుందన్నారు. పిల్లల్ని పనుల్లో పెట్టుకోకూడదని, గ్రామాల్లో మోతుబరులు దగ్గర పాలేరులుగా పెట్టుకుని వారితో వెట్టి చాకిరీ చేయించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.నాగరాజు, లోక్ అదాలత్ ప్యానెల్ న్యాయవాదులు అంగజాల అజయ్‌కుమార్, తిర్రే సత్యనారాయణ పాల్గొన్నారు.

కౌలు చట్టం..

కథ కంచికేనా..!



కౌలు రైతులను కూటమి సర్కార్ మోసం చేస్తోందా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పక్కకు పెట్టేసిందా.. కౌలు చట్టంలో మార్పులు చేస్తామంటూ తొలుత హడావుడీ చేసి మౌనం వహించడం వెనుక కారణం అదేనా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం బిల్లు ప్రవేశ పెట్టి వచ్చే ఖరీఫ్ నుంచి ప్రభుత్వం అమలు చేస్తోందా అన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశం ఉండడంతో కొత్త కౌలు చట్టంపై కౌలు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కౌలుదారులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

- కొత్త చట్టం తెస్తామంటూ ఆదిలో కూటమి సర్కార్ హడావుడీ
- ఆ తర్వాత మౌనం
- ఏలూరు, పశ్చిమ జిల్లాలో దాదాపు 3 లక్షల మంది కౌలు రైతులు
- వైసిపి ప్రభుత్వం చట్టంలో చేసిన మార్పులతో తీవ్ర నష్టం
- కొత్తచట్టం తెచ్చి న్యాయం చేస్తామంటూ కూటమి హామీ
- జిల్లాలో ఏర్పాటు చేసిన ముసాయిదా సమావేశం రెండు సార్లు రద్దు
- బడ్జెట్ సమావేశాల్లో చట్టం తెస్తారా అంటూ రైతుల్లో చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో అత్యధికంగా కౌలురైతులు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నారు. దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉండగా, జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కలు సైతం ఇదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. అందరికీ అన్నంపెట్టే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదు. సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందకుండా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకు కారణం కౌలుచట్టంలో ఉన్న లొసుగులే కారణమని చెప్పొచ్చు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ అధీకృత సాగుదారుని' చట్టం పేరుతో కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ చట్టం కౌలురైతులకు కొంతమేర ఉపయోగపడినా పూర్తిస్థాయిలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఈ చట్టంలో భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసేవిధంగా నిబంధనలు తెచ్చారు. దీంతో కౌలుకార్డుల ఇవ్వకపోతే కౌలురైతులు, రైతుసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీసేవారు. దీంతో కౌలుకార్డులు సాగుదారులకు అందేందుకు కొంత దోహదపడింది. కౌలుకార్డులు అందుకున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలంటూ బ్యాంకుల వద్ద ఆందోళన చేసి కొంతమేర సాధించుకునేవారు. కౌలురైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా కౌలుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతులు, రైతుల సంఘాల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉండేది.

వైసిపి చేసిన చట్టంతో కౌలురైతుల మెడకు ఉరి..

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించాయి. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడం, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏ ఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరికి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టాల ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

కొత్త కౌలుచట్టంపై తొలుత హడావుడీ..తర్వాత మౌనం

తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించి రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు ముగిసిపోయాయి. ఫిబ్రవరి చివరి వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం చూస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో కొత్త కౌలుచట్టం తెస్తారా లేక రైతులను మోసం చేస్తారా తేలిపోనుంది. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాల అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్ధిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

దశల వారీగా ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యం


జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో దశలవారీగా ప్లాస్టిక్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణిని హైదరాబాద్ ఎఇ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులు కలిసి, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వారు తయారుచేసి ప్రదర్శించిన బయో ఎలైట్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి కె.దిలీప్ మాట్లాడుతూ వాటర్ బాటిల్, వాటర్ గ్లాస్, లిక్కర్ గ్లాస్, స్ట్రా, వివిధ రకాల క్యారీ బ్యాగులు, వివిధ సైజుల్లో డస్ట్ బిన్ కవర్స్, రెస్టారెంట్లో, కర్రీ పాయింట్‌లో వినియోగించే ఫుడ్ ప్యాకింగ్ డబ్బాలు, కర్రీ ప్యాకింగ్ కవర్స్, భోజనం ప్లేట్లు, మొక్కజొన్న కండి లోపలి భాగాన్ని వినియోగించి తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. తయారు చేసిన ఉత్పత్తులు సుమారు నాలుగు నుంచి ఐదు నెలల కాలంలో భూమిలో డీ కంపోస్ట్ అవుతాయని వివరించారు. శ్రీశైలం, కేరళ దేవాలయాల వద్ద వాటర్ బాటిల్స్ అమ్మకాలకు అనుమతులు లభించాయని, త్వరలో సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో దశలవారీగా ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొట్టమొదటిగా కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిల్స్‌కు బదులుగా స్టీల్ బాటిల్స్, స్నాక్స్ ప్లేట్స్, టీ తాగడానికి గాజు, స్టీల్ వాటర్ గ్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 1 నుంచి పట్టణంలోని అన్ని టీ స్టాల్స్‌లో, మద్యం షాపుల్లో ప్లాస్టిక్ టీ గ్లాసులు, వాటర్ గ్లాసులు, వివిధ వాణిజ్య అంగళ్లల్లో క్యారీ బ్యాగులు నిషేధిస్తూ ప్రకటించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఉన్నారు.



బయో ఎలైట్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి



నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జివి.సుందర్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు 18 నామినేషన్లు

మొత్తం 20 మంది అభ్యర్థులు 24 సెట్ల నామినేషన్లు దాఖలు

నేడు, రేపు సెలవు దినాలు

పదో తేదీ ఒక్కరోజే గడువు

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్లో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నామినేషన్లు స్వీకరించారు. టిడిపి అభ్యర్థిగా బరిలో దిగిన పేరాబత్తుల రాజశేఖరం తరపున కాకినాడకు చెందిన ఎస్‌వి.విశ్వనాథం నామినేషన్ దాఖలు చేశారు. పెద్దాపురానికి చెందిన వానపల్లి శివ గంగ వీరగణేష్, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన బండారు రామ్మోహన్ రావు, దొడ్డిపట్ల పెదలంకకు చెందిన నేతిపూడి సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరుకు చెందిన పచ్చిగొల్ల దుర్గారావు, భీమవరం కు చెందిన బొమ్మిడి సన్నిరాజ్, రాజమండ్రికి చెందిన జివి.సుందర్, రామచంద్రపురానికి చెందిన కుక్కల గోవిందరాజు, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కాండ్రేగుల నరసింహులు, జగ్గంపేటకు చెందిన గద్దే విజయలక్ష్మి, నర్సాపురానికి చెందిన కట్టా వేణుగోపాలకృష్ణ, బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మాకే ప్రసాద్, పోలవరానికి చెందిన చిక్కాల దుర్గారావు, నిడదవోలుకు చెందిన తాళ్లూరి రమేష్, ఏలూరుకు చెందిన చిక్కా భీమేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయగా, ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ములగల శ్రీనివాసరావు మరోసెట్టు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థులతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ మూడో తేదీ నుంచి ఇప్పటివరకూ మొత్తం 20 మంది అభ్యర్థులు 24 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పదో తేదీన అట్టహాసంగా నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న పరిస్థితి ఉంది.

నామినేషన్లకు ఇక ఒక్కరోజే గడువు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి నామినేషన్ల గడువు ఇంకా ఒక్కరోజు మిగిలింది. ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియకు షెడ్యూల్ విడుదలైంది. ఇప్పటివరకూ 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో నామినేషన్ దాఖలకు వీలులేదు. దీంతో చివరితేదీ పదో తేదీ ఒక్కరోజు మిగిలింది. ఆఖరు రోజు ఎన్ని నామినేషన్లు దాఖలవుతాయో చూడాల్సి ఉంది.

పార్కుల అభివృద్ధికి చర్యలు : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో శరవేగంగా పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రధాన పార్కులో జరుగుతున్న పార్క్ అభివద్ధి పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్కులో అభివృద్ధి పనులకు డిజైన్ చేసిన డ్రాయింగ్‌ను పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పట్టణ ప్రజలను, ముఖ్యంగా పిల్లలను ఆహ్లాదకరంగా ఉంచేందుకు అవసరమైన ప్రదేశాలు ఏమీ లేకపోవడంతో ఆలోచన చేసి పట్టణంలోని దాతల సహకారంతో భీమవరంలోని అన్ని పార్కులనూ దశలవారీగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా హౌసింగ్ బోర్డులోని ప్రధాన పార్కును ఇప్పటికే రూ.10 లక్షలతో గ్రౌండ్ లెవెలింగ్, స్టేజ్ రీ మోడలింగ్, స్ట్రక్చర్స్ ఏర్పాటు పనులను చేపట్టడం జరిగిందన్నారు. అలాగే రూ.20 లక్షల విలువైన పనులు చేపట్టాల్సి ఉందని, ప్రధానాకర్షణగా నటరాజ విగ్రహం, రెండు గజిబాలు ఏర్పాటు చేయడానికి డిజైన్‌లో పొందుపర్చడం జరిగిందని వీటికి సుమారు మరో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఖర్చవుతోందని తెలిపారు. ఈ పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నిధులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. తొలుత హౌసింగ్ బోర్డు కాలనీలో సుమారు 3 లక్షల రూపాయల వ్యయంతో హౌసింగ్ బోర్డు అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల మానిటరింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.రామారావు, సెక్రటరీ జె.మధుసూదనరావు, ట్రెజరర్ సిహెచ్‌వి ఎల్.సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.



పార్కు డిజైన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు : ఎస్‌పి

నరసాపురం : పంటులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ హెచ్చరించారు. నరసాపురం, మాధవాయిపాలెం నుంచి చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం డిఎస్‌పి జి.శ్రీవేదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎక్కువ మంది పంటు మీదకు రాకుండా ప్రవేశ మార్గాల వద్ద నియంత్రించాలన్నారు. భద్రతా చర్యలు, ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, నిర్వాహకులతో చర్చించారు. ఈతగాళ్ళు, పోలీస్ బందోబస్తు రేవుల్లో తిరునాళ్ళు ముగిసే వరకూ విధుల్లో ఉండాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద దొంగతనాల నివారణకు ఆస్కారం లేకుండా తిరునాళ్ళు ముగిసే వరకూ పటిష్ట బందోబస్తు ఏర్పాటుతో పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డ్రోన్ కెమెరాతో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ డిఎస్‌పి కె.మానస, సిఐ బి.యాదగిరి, ఎస్‌ఐలు సిహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

మదర్ నెస్ హాస్పిటల్ ప్రారంభం

భీమవరం టౌన్ : సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేలా అత్యంత టెక్నాలజీతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. భీమవరం జెపి రోడ్డులో 'మదర్ నెస్' ఆసుపత్రిను ఆయనతో కలిసి రాష్ట్ర మంత్రి నారాయణ, మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నారాయణ మాట్లాడుతూ వైద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని, సామాన్యులకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని అన్నారు. మండలి ఛైర్మన్ మోషేను రాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ భీమవరం వైద్య, విద్యారంగంలో అగ్రగ్రామిగా ఉందని, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఈ ప్రాంతంలో అందుబాటులోనే ఉన్నాయని అన్నారు. మదర్ నెస్ ఫౌండర్, డైరెక్టర్, శిశు, చిన్న పిల్లల వ్యాధుల సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వంశీ శివరామరాజు, గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ వైద్య నిపుణులు డాక్టర్ కె.మానస శ్రావ్య మాట్లాడుతూ పసి ప్రాణాల రక్షణే మా ధ్యేయమని, శిశు మరణాలు అరికట్టాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రుని అత్యంత టెక్నాలజీతో ప్రారంభించామని అన్నారు. సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ పివి.చైతన్య వర్మ, కో ఫౌండర్ డాక్టర్ వి.దుర్గామౌనిక, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీమాధురీ బట్టు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తణుకు : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో శుక్రవారం ఆటో కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఆటో కార్మికులు ఈ రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది ఉన్నారన్నారు. వారు స్వయం ఉపాధితో ఆటోలను నడుపుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సహాయం చేయకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోలు కొనుగోలు చేయాలంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. స్పేర్ పార్టులు, పెట్రోలు, డీజిల్ పెరిగాయని, ప్రయివేట్ ఫైనాన్స్‌లకు వడ్డీ రూపంలో అధిక మొత్తంలో చెల్లిస్తూ ఆర్థికంగా కార్మికులు నష్టపోతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మునిస్వామి డిమాండ్ చేశారు. ఆటోల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణాలు బ్యాంకుల నుంచి ప్రభుత్వం మంజూరు చేయించాలని తెలిపారు.

రక్త సేకరణలో భాగస్వాములు కండి

జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ

ప్రజాశక్తి - భీమవరం

జీవితాలకు పునర్జన్మనిచ్చేది ఒక రక్తదానం మాత్రమేనని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. నారాయణ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా శాఖ వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రక్త సేకరణలో భాగంగా విద్యాశాఖ నుంచి రాయలం గ్రామపంచాయతీలో ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ ప్రారంభించి మాట్లాడారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఆసక్తిగల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది రక్తదానం చేయాలని, ఒకరిచ్చే రక్తదానం ముగ్గురు జీవితాలను కాపాడుతుందన్నారు. తాడేపల్లిగూడెంలోను, ఈనెల 11న నరసాపురం, పాలకొల్లు కేంద్రాలలోను, 13న తణుకు, 14న భీమవరం రాయలంలోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్త సేకరణ జరుగుతుందని తెలిపారు. ఈ ఆరు క్యాంపుల ద్వారా 300 యూనిట్ల రక్తాన్ని సేకరించాలి అనేది విద్యాశాఖ లక్ష్యం అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఛైర్మన్ డాక్టర్ ఎం.శివరామభద్రి రాజు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సేకరించిన రక్తం ఎంతో మంది జీవితాలను కాపాడుతుందని, భీమవరం పట్టణానికి దగ్గరలో రాయలం గ్రామంలో రెడ్ క్రాస్ సంస్థ నూతన భవనంలో అత్యంత ఆధునికమైన పరికరాలతో నిర్వహిస్తున్నామన్నారు. గొల్లలకోడేరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమం నుంచి కార్యక్రమ కోఆర్డినేటర్, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 36 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. వీరిని అభినందించి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, రెడ్ క్రాస్ ఛైర్మన్ శివరామరాజు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఉప విద్యాశాఖాధికారి నాగరాజు, ఎంఇఒ 1 ఎన్.శ్రీనివాస్, వీరవాసరం ఎంఇఒ శ్రీమన్నారాయణ, ఎండీఎం ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణారావు, చిన్నయ్య, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ ట్రెజరర్ కెబి.తిరుపతిరాజు, మెంబర్ సిహెచ్.ఫణికుమార్, కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు, లైఫ్ మెంబర్ జి.కృష్ణారావు పాల్గొన్నారు.

నరసాపురంలో ఉద్రిక్తత

పెళ్లిలో తలెత్తిన వివాదం : రెండు గ్రూపుల దాడులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 29వ వార్డు అరుంధతిపేటలో రెండు గ్రూపుల మధ్య శుక్రవారం సాయంత్రం ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువురు పరస్పరం ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్ళు రువ్వుకున్నారు. ఈ ఘటనలో పలువురుకి గాయాలయ్యాయి. క్షతగ్రాతులు ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం రాత్రి ఓ వివాహం దగ్గర ఇరువురికి ఘర్షణ ఏర్పడింది. అప్పటి నుంచి పేటలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చిన్నపాటి గొడవ కాస్త రాళ్ల రువ్వుకుని దాడి చేసుకునే వరకూ వెళ్లింది. ఉదయం వరకు చాప కింద నీరులా ఉన్న రెండు గ్రూపులు సాయంత్రం ఒక్కసారిగా మళ్లీ ఘర్షణకు దిగాయి. కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒక్కరు దాడికి పాల్పడారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న నరసాపురం డిఎస్‌పి శ్రీవేద, ట్రెయినీ డిఎస్‌పి కె.మానస, సిఐ బి.యాదగిరి సంఘటనా చేరుకుని ఇరు గ్రూపులను చెదరగొట్టారు. పోలీసులపై కూడా రాళ్లు రువ్వారు. డిఎస్‌పి చాకచక్యంగా వ్యవహరించి అదనపు పోలీస్ బందోబస్తును రప్పించి పేటలో మోహరించారు. అనంతరం ఇరు గ్రూపులను పెద్దలతో కూర్చోబెట్టి మాట్లాడి శాంతింప చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. సంఘటనకు సంబంధించిన వివరాలను బాధితుల నుంచి డిఎస్‌పి సేకరిస్తున్నారు. ఇరుపక్షాలపై కేసు నమోదు చేశారు. మళ్లీ ఇటువంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసాపురం అరుంధతి పేటలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరూ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీవేద హెచ్చరించారు. అనంతరం స్పెషల్ పార్టీ బలగాలు, పోలీసు సిబ్బందితో పికెటు ఏర్పాటు చేశారు. నరసాపురం రేవు పరిశీలించడానికి వచ్చిన ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి విషయం తెలుసుకుని దాడిపై ఆరా తీశారు. అర్ధరాత్రి వరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉండి ఘటన గల కారణాలు సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.




ఓ గ్రూపును అదుపు చేస్తున్న పోలీసులు

ఉపాధి హామీ కూలీలకు పనులు చూపాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - గణపవరం

పనిలేని రోజుల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు చూపించాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నా గ్రామాల్లో ఎక్కడా అమలు చేయటం లేదని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేశవరం పంచాయతీ వద్ద పనులు చూపించాలని కోరుతూ జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని అన్నారు. సంఘం మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ పనిచేసిన ప్రాంతంలో ఫొటో తీయకుండా ముందు ప్రారంభించిన చోటే ఫొటో తీయాలి అనే పేరుతో అనేక కిలోమీటర్లు ఉదయం, సాయంత్రం అధికారులు నడపించటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వాసాగు పెరిగిన తరువాత వ్యవసాయ సాయంలో పనులు కనుమరుగైనట్లు అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పని చూపించాలని లేదా భృతి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు, కేతా శ్రీనివాస్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా ఉపాధి హామీ పనులకు వేతనం పెంచాలని అన్నారు. 150 రోజులు పనులు చూపించాలని తెలిపారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శి డివిఎల్ నరసమాంబకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీతల సామ్యూల్, తలపాక యేహన్, పెచ్చెట్టి ధనలక్ష్మి, పి.నరశింహమూర్తి, పంపన పద్మ, గుబ్బల సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, మామిడి శెట్టి రామలక్ష్మి, పి.సూరమ్మ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిని అందజేస్తున్న కార్మికులు

ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు

తణుకు : మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్ట ప్రకారం సౌకర్యాలు అమలు జరిగేలా కార్మికశాఖ చర్యలు తీసుకోవాలని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకులో స్థానిక అమరవీరుల భవనంలో మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోటార్ ట్రాన్స్‌పోర్టు రంగంలో కోట్లాది మంది పనిచేస్తున్నారన్నారు. ఒక చోట నుంచి మరొక చోటికి రవాణా ద్వారా సరుకులు, ప్రయాణికుల్ని ఎంతో క్షేమంగా తీసుకువెళ్తున్నారని తెలిపారు. అలాంటి డ్రైవర్ల మెడకు ఉరితాడు లాగా ఉన్న 2019 రోడ్డ సేఫ్టీ చట్టాన్ని సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెట్రోల్, డీజిల్‌పై ప్రభుత్వ పన్నులు మినహాయింపు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వ్యతిరేక విధానాలు ఆపాలని, మార్చి 24న జరిగే ఛలో ఢిల్లీకి పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుబ్బల గోపి, అందే శ్రీనివాస్, చిట్టిబాబు, ప్రసాద్, అమిరుద్దీన్, వంశీ, మురళీ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ వినియోగించుకోవాలి

విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథ బాబు



భీమవరం : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ వినియోగించుకుని విద్యుత్ ప్రోత్సహించాలని విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథ బాబు కోరారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలుపై విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఆర్డిఒలు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఈ పథకం అమలు తీరును విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథ్ బాబు వివరించారు. సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుంటే గరిష్టంగా రూ.78 వేల వరకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. సోలార్ వినియోగించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునేవారు ఎటువంటి సందేహాలు ఉన్న జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నెంబర్ 9490610152ను సంప్రదించాలని కోరారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం వినియోగించుకోవడం వల్ల చేకూరే లబ్ధిపై గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.

నేటితో ముగియనున్న మద్యం షాపుల గడువు

తణుకు ఎక్సైజ్ సిఐ సత్తి మణికంఠ రెడ్డి

పెనుమంట్ర : తణుకు డివిజన్లో కల్లుగీత కార్మికుల కోసం కేటాయించిన షాపులకు గాను పెంచిన గడువు లోపు అప్లికేషన్స్ ఇవ్వాలని ఎక్సైజ్ సిఐ సత్తి మణికంఠ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు రిజర్వు చేసిన మద్యం షాపులకు గాను ఇప్పటి వరకు అందిన అప్లికేషన్ల వివరాలను ఆయన వెల్లడించారు. తణుకు పట్టణమునకు గాను మూడు అప్లికేషన్లు, తణుకు రూరల్ మండలానికి ఏడు, ఇరగవరం పది, పెనుగొండ మూడు, పెనుమంట్ర ఐదు అప్లికేషన్లు ఇప్పటి వరకూ దాఖలు చేయబడ్డాయని ఆయన పేర్కొన్నారు.

మార్చి 1 నుంచి పెద్దింట్లమ్మ ఉత్సవాలు

ఆకివీడు : కొల్లేటికోటలో కొలంక పెద్దింట్లమ్మ ఉత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ కార్యనిర్వాహక అధికారి వేణుగోపాలరావు తెలిపారు. ప్రతి ఏటా జరిగే వార్షిక మహోత్సవాలు 13 రోజులు జరుగుతాయని, మార్చి 13 వరకు ఈ ఉత్సవాలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా కొల్లేటికోట(పెద్దింట్ల) జలదుర్గ గోకర్ణేశ్వర స్వామల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

సామూహిక ఎలుకల నివారణకు సహకరించాలి

తాడేపల్లిగూడెం : రైతులు ఎదుర్కొంటున్న ఎలుకల సమస్య పరిష్కారానికి రైతులంతా సామూహిక ఎలుకల నివారణకు భాగస్వాములు కావాలని కృష్ణయ్యపాలెం గ్రామ సర్పంచి బిళ్లపాటి వెంకటలక్ష్మి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని కృష్ణయ్యపాలెంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు ఎలుకల నివారణ మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు దేవల్ల వెంకట సుబ్బారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

తణుకు : ఎలుకల నిర్మూలన వల్ల ఎకరానికి 2 శాతం నుంచి 3 శాతం దిగుబడిని పెంచుకోవచ్చని ఇరగవరం మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. రైతులు అందరూ విధిగా విషపు ఎరను తీసుకుని వారి పొలాల్లో గట్ల వద్దనే కాకుండా తమ పరిధిలో గల ఖాళీ ప్రదేశాలు, కళ్లాలు, దిమ్మలు, కాలువ గట్ల వెంట ప్రదేశాల్లో కూడా విషపు ఎరను పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్కెఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్వేతకు డాక్టరేట్

భీమవరం టౌన్ : భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్వేత కన్నేపల్లికి విజయనగరంలోని జెఎన్టియు జివి యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్లో పిహెచ్డి అవార్డు పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి మురళీకృష్ణం రాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ శ్వేతను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ జెఎన్టియు విజయనగరం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయకుమార్ సూపర్వైజర్, కో సూపర్వైజర్ డాక్టర్ వి.ఎస్ వరుణ్ పర్యవేక్షణలో 'సెల్ఫ్ ఆర్గనైజ్డ్ ఫజ్జీ కంట్రోలర్ ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోలర్ అండ్ పవర్ సిస్టమ్ ఇంట్రా కంట్రోలర్' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు యూనివర్సిటీ పిహెచ్డి ప్రదానం చేసిందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ట్రిపుల్ ఇఇ విభాగం హెడ్ డాక్టర్ బికరెడ్ వర్మ శ్వేతను అభినందించారు.

15న ఎస్ఆర్కెఆర్లో సూపర్ నోవా 2కె25

భీమవరం టౌన్ : ఈనెల 15వ తేదీన భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సూపర్ నోవా 2కె 25 పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణం రాజు చెప్పారు. సూపర్ నోవా పోస్టర్ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ జి.శ్రీబాల మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యార్థులు నూతన ఆలోచనలకు, ఆవిష్కరణలకు దర్పణం నిలిచే పలు కాంపిటీషన్స్ కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతులు కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ తమ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. అందుకు సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ అత్యుత్తమంగా తీర్చిదిద్దటమే కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాక్టికల్ అడ్వైజర్ డాక్టర్ పి.వి.రాంబాబు, ప్రాక్టికల్ కోఆర్డినేటర్లు ఎం.వెంకట్రావు, ఎంఎస్ఆర్.చైతన్య ఉన్నారు.

గుండెపోటు రక్షణపై అవగాహన

నరసాపురం : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆకస్మాత్తుగా వచ్చే గుండెపోటు రక్షణపై స్టెమి సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుండెపోటు వస్తే చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వం అందించే ఉచిత బెనిఫిట్ ఇంజక్షన్ పై ఎఎన్ఎం, ఆశవర్కర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ గుండెపోటు వస్తే అన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో స్టెమి సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గుండెపోటు లక్షణం ఉంటే ఈసెంటర్లలో చికిత్స తీసుకోవాలన్నారు. దీనిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహాస్, డాక్టర్ శిరీష, డాక్టర్ రాజేష్, డాక్టర్ విజయశాంతి పాల్గొన్నారు.

పంట బోదె ఆక్రమణ

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో పంట బోదె ఆక్రమణకు గురవుతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతంలోని నాగేంద్ర ఆలయ సమీపం నుంచి జాతీయ రహదారి పైనుంచి కోనా కోడి వరకు ముదిరి బోదె ఉంది. కోనమ్మ కోడ్ వైపునకు ఉన్న ముదిరి బోదెలో ఇరువైపుల ఉన్న స్థలాల యజమానులు సిసి పైపులను ఏర్పాటు చేసి పూడిక చేస్తున్నారు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి ముదురు కోనాయకోడుకు వెళ్లడంకు ఆటంకం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై తహశీల్దార్ కె.రాజ కిషోర్ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేటి నుంచి సత్తెమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉండి : మండలంలోని పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక మహోత్సవం నేటి నుంచి ప్రారంభించనున్నట్లు కలిదిండి నరసింహారావు(బాబు) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి బాణాసంచా కాల్పులు, మేళ తాళాలు, గంగిరెద్దు ఊరేగింపులు తదితర కార్యక్రమాలతో అమ్మవారిని గ్రామ నడివీధిలో నిలుపుతారని, 16వ తేదీ ఆఖరి వరకు సమారాధన కార్యక్రమంతో జాతర మహోత్సవాలు ముగింపు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం 1008 కలశాలతో ముత్తైదువులు గ్రామ పురవీధులో కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి అభిషేకం చేస్తారని, గ్రామ ప్రజలు, ఆడపడుచులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కలిదిండి భాస్కరరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'పది' ఉన్నత విద్యకు తొలిమెట్టు

పకడ్బందీగా పరీక్షల ప్రణాళిక
ఎంఇఒ-1 రవీంద్ర

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థి దశలో పదో తరగతి ఉన్నత విద్యకు తొలిమెట్టుగా ఉందని కాళ్ల ఎంఇఒ-1 ఎ.రవీంద్ర తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యతా ప్రమాణాల బోధన సాగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులు ఏడు పేపర్లే పరీక్షలు రాయనున్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఇప్పటి నుంచే పాఠశాలల్లో సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికతో విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచి, మంచి మార్కులతో ఉత్తీర్ణులను చేయొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రణాళిక అమలు, తదితర విషయాలను ఎంఇఒ ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని పాఠశాలల నుంచి ఎంతమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు?

మండలంలో కాళ్ల, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కలవపూడి, దొడ్డనపూడి, సీసలి, కోపల్లె, బొండాడ, మాలవానితిప్ప(తొమ్మిది) ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 600 మంది పదవ తరగతి విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు.

చిట్ చాట్

ప్రశ్న : ఉత్తమ ఫలితాల సాధనకు మీరు తీసుకుంటున్న చర్యలు?

ప్రతీ పాఠశాలలో ఉదయం, సాయంత్రం సమయాల్లో అదనంగా గంట చొప్పున నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?

ప్రతీ విద్యార్థిని విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి, ప్రత్యేక రివిజన్ క్లాసులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గత ఏడాది ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు?



గత సంవత్సరం 82 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దానిని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న : పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఉదయం, సాయంత్రం రివిజన్ చేయడం, వెనకబడిన పిల్లలకు ప్రత్యేక మెటీరియల్తో తర్ఫీదు ఇస్తున్నాం.

ప్రశ్న : ఉచిత స్టడీ మెటీరియల్, మోడల్ టెస్ట్ పేపర్స్ విద్యార్థులకు అందించారా?

కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు అందించాం. మిగతా విద్యార్థులకు త్వరలో అందించడం జరుగుతుంది.

ప్రశ్న : విద్యలో వెనుకబడిన విద్యార్థులపై తీసుకుంటున్న చర్యలు?

ప్రత్యేక తరగతులు, ఒక్కొక్క టీచరుకి ఆరుగురు విద్యార్థుల చొప్పున భాధ్యతలు అప్పగించారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు చదువుతున్నారా? లేదా? ఎలా చదువుతున్నారు అనే విషయాలు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలుసుకుంటున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఫోన్లో సందేహాలు నివృత్తి చేయడం జరుగుతుంది.

ప్రశ్న : పరీక్షల షెడ్యూల్ ఎలా రూపొందించారు?

పదో తరగతి పరీక్షలు సమీస్తున్నాయి. ఒత్తిడి లేకుండా మార్చి 17 నుంచి రోజు విడిచి రోజు ఉండేలా పరీక్షల షెడ్యూల్ రూపొందించారు. సంవత్సరమంతా కష్టపడిన శ్రమ వృథా కాకుండా ఉండాలంటే ఈ రెండు నెలల కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడి, భయం దరి చేరనీయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే మంచి మార్కులు సాధించవచ్చు.

ప్రశ్న : సెలవుల్లో మధ్యాహ్న భోజనం ఎంతమంది విద్యార్థులకు ఉపయుక్తం?

తొమ్మిది జెడ్పి ఉన్నత పాఠశాలల్లో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులకు ఫిబ్రవరి 2 నుంచి మార్చి 17న పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యే వరకు పాఠశాలలకు మొత్తం 11 సెలవు దినాలొచ్చాయి. వీటిలో ఏడు ఆదివారాలున్నాయి. అవి కాకుండా రెండో శనివారాలు 03, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి, మార్చి 14వ తేదీన హోలీ పర్వదినాలు వచ్చాయి. ఈ రోజుల్లోనూ విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందిస్తుంది.

వంటపాత్రలు, ఫ్యాన్ వితరణ

సంక్షేమ కార్యక్రమాల్లో జనసేన

గణపవరం : జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనంకు అవసరమైన వంట గ్యాస్, పాత్రలు జనసేన నాయకులు అందజేశారు. అనంతరం స్థానిక పిహెచ్సి డాక్టర్ కిరణ్మయికి ఫ్యాన్ను అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలలో భాగంగా వంటపాత్రలు ఫ్యాన్ అందజేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమానికి జనసేన నిరంతరం కృషి చేస్తుందన్నారు. హైస్కూల్ హెచ్ఎం కొయ్యన పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంకి వంట పాత్రలు, గ్యాస్ అందించినందుకు జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ గాదిరాజు ఈశ్వర్ రాజు, సప్పా రాంబాబు, వేగేశ్న గనిరాజు, సెల్ పాయింట్ ప్రసాద్, చామకూరి బాలు, సలాది నాని, కిలాని గోవిందు, తోట మారన్న, తోట శేషారావు, పి.నాగేశ్వరరావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.

అంతర్వేది తిరునాళ్లకు యాత్రికులు

పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

నరసాపురం : అంతర్వేది తిరునాళ్లకు నరసాపురం మీదుగా మాధవాయి పాలెం పంటి నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు వెళ్తున్నారు. శుక్రవారం రాత్రిస్వామివారి కళ్యాణం, శనివారం స్వామివారికి రథోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో నరసాపురం మీదుగా ఏలూరు, కృష్ణా జిల్లా నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు అంతర్వేదికి ప్రయాణమయ్యారు. పంటి వద్ద సచివాలయ, పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటుచేశారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది హెల్త్ క్యాంప్లు బస్టాండ్, రైల్వే స్టేషన్, పంటి రేవు వద్ద ఏర్పాటు చేశారు. పంటి రేవు వద్ద గజ ఈతగాళ్లు లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉన్నారు. మాధవాయిపాలెం రేవు వద్ద నరసాపురం డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద, ట్రైయినీ డిఎస్పి కె.మానస బందోబస్తు నిర్వహిస్తు సూచనలు చేశారు.



పాలకోడేరు : పౌష్టికాహారాన్ని అందజేస్తున్న సూపర్వైజర్

'పౌష్టికాహారంతోనే ఆరోగ్యం'

పాలకోడేరు : ప్రతిరోజు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని విస్సకోడేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ కె.సూర్య కుమారి అన్నారు. శృంగవృక్షం, పెన్నాడ, గొరమూడి, విసాకోడేరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల వద్ద సూపర్వైజర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత, ప్రాధాన్యత గురించి వారికి వివరించి పలు సూచనలు సలహాలు అందజేశారు.

పెనుమంట్ర : ఆడపిల్లలకు పది తర్వాత పెళ్లి చేయకుండా, ఇంకా ఉన్నత చదువులు చదివించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్.వెంకట లక్ష్మి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పొలమూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు, వారి తల్లులకు నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఆడపిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమేనని పాఠశాల హెచ్ఎం కె.సరస్వతి అన్నారు. సమాజంలో ఆడపిల్లలు విద్య ద్వారా ప్రగతి సాధించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పోషక పదార్థాలను వినియోగించుకోవాలని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి కోరారు. శుక్రవారం మండలంలోని మార్టేరు తోకహరిజన పేట అంగన్వాడీ కేంద్రం 3లో విహెచ్ఎస్ఎన్డి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ పోచమ్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం మండలంలోని మార్టేరు అంగన్వాడీ కేంద్రాలు 5, 6లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుధారాణి, తల్లులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

వియర్ ఛానల్ నిర్మాణానికి కృషి

మొగల్తూరు : వియర్ ఛానల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని నీటి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల మారాజు అన్నారు. మండలంలోని మోడీ గ్రామంలో వియర్ ఛానల్ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న వియర్ ఛానల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని విప్ బొమ్మిడి నాయకర్, డిస్టిబ్యూటర్ కమిటీ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దాసరి బాబి, సర్పంచి మారెళ్ల మాధవి సుబ్రహ్మణ్యం, బండి ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, దాసరి నాగరాజు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా : ఎంఎల్ఎ

ఉండి: ఉండి గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత చెన్న మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఉండి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు, ఉండి డిసి ఉపాధ్యక్షులు మంతెన సాయిలచ్చిరాజు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు సన్నిధిరాజు చలపతి రావు ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రాన్ని ఎంఎల్ఎకు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పాకలపాటి రామరాజు, పేరిచర్ల కృష్ణంరాజు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ ఉన్నారు.

కొనసాగుతున్న వరినాట్లు

ప్రజాశక్తి - ఆచంట



ఆచంట వేమవరంలో కొనసాగుతున్న వరినాట్లు

మండలంలోని ఆచంట వేమవరం గ్రామంలో దాళ్వా ఊడ్పులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి, సార్వామాసుల ఆలస్యం కారణంగా పనులు మందకొడిగా జరుగుతున్నాయి. జనవరి 15 నాటికి నాట్లు పూర్తి కావాలని అధికారులు పదేపదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ గ్రామంలో సార్వపంట వచ్చేసరికి అధిక వర్షాలు, వరదల కారణంగా పంట పొలాలు ముంపునకు గురై రెండుసార్లు నాట్లు వేయవలసిన పరిస్థితి నెలకొంటుంది. ఈ తరహాలో సార్వపంట జనవరి 20 నాటికి పూర్తయింది. దీంతో సార్వపంటకు ముంపు, దాళ్వా పంటకు వచ్చేసరికి నీటి ఎద్దడి రైతులను అతలాకుతలం చేస్తుంది. ఆచంట వేమవరం గ్రామంలో లింగరాజు చెరువు, వద్దిపర్రు వెళ్లే మార్గంలో సుమారు 800 ఎకరాల్లో వరి పూర్తిగా జగ్గరాజు కాలువపై ఆధారపడి ఉంది. ప్రతి ఏట దాళ్వా ప్రారంభం నుంచే రైతులు అనేక కష్ట నష్టాలతో పంటను సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనపు పెట్టుబడులు తప్పడం లేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆచంట వేమవరం గ్రామానికి పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీరందిస్తాం

ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచి నీరు అందించాలనేది తన లక్ష్యమని ఎపి ఉప సభాపతి, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. పెద అమిరంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో పలు గ్రామాలలో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ మంచి పని చేయడానికి తమ వంతు సహకరిస్తామని, పలువురు దాతలు ముందుకు వచ్చి రూ.16 లక్షల చెక్కులను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారుల సమక్షంలో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసే సంస్థ ప్రతినిధికి ఆ చెక్కును అందజేశారు. తక్షణమే పనులను ప్రారంభించాలని ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆకివీడు ఆర్డబ్ల్యూఎస్ ఇన్ఛార్జి డిఇటి.శ్రీనివాసరావు, ఆకివీడు ఎఇ కె.భోగరాజు, పాలకోడేరు ఎఇ ఎన్.పార్వతి, కాళ్ల ఇన్ఛార్జి ఎఇ ఎ.ఫణి, ఉండి ఎఇ కె.హరినాధరాజు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండకుండా వాహనాలు నడిపితే చర్యలు

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రమణ

ప్రజాశక్తి - భీమవరం

18 ఏళ్లు నిండకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.రమణ హెచ్చరించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా శుక్రవారం భీమవరం భారతీయ విద్యాభవన్ స్కూల్లో విద్యార్థులకు, బస్సు డ్రైవర్లకు రోడ్ సేఫ్టీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వి.రమణ మాట్లాడుతూ కారులో ప్రయాణించినప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. స్కూల్ బస్ డ్రైవర్లు అందరూ వాహనం నడిపేటప్పుడు సెల్ఫోన్ మాట్లాడవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం ప్రకారం స్కూల్ బస్సు నిర్వహణలో స్కూల్ యాజమాన్యం బాధ్యతలు, డ్రైవరు బాధ్యతలు, రవాణా శాఖ బాధ్యతల గురించి వివరించారు. స్కూల్ ప్రిన్సిపల్ టిజె.దేవి పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ గురించి, డ్రైవర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ యుఆర్కె.రవిరాజు, ట్రాన్స్పోర్ట్ ఇన్ఛార్జి వర్మ, కల్చరల్ డిపార్ట్మెంట్ ప్రభావతి, 200 మంది విద్యార్థులు, డ్రైవర్స్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి పనులు తాడేపల్లిగూడెం ప్రజలు ఇప్పుడు చూస్తున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ప్రజలు చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పని చేసిందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర అభివృద్ధి శూన్యం అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి అని గద్దెనెక్కిన జగన్ ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల్లో 20 సంవత్సరాల వెనకబాటుతనాన్ని చూసామని విమర్శించారు. అభివృద్ధి అంటే ఏమిటో ఈ ఐదేళ్లలో చూపిస్తామని ఎంఎల్ఎ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఎంఇఒ జ్యోతి

ప్రజాశక్తి - ఉండి

నూటికి నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యా బోధన అందిస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బొల్లిపో జ్యోతి అన్నారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన కాల నిర్ణయ పట్టిక అనుసరించి విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సమాయత్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, 467 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని, వారిలో 18 మంది విద్యార్థులు ఎ గ్రేడ్కి చెందిన వారని, 92 మంది విద్యార్థులు బి గ్రేడ్కి చెందగా 211 మంది విద్యార్థులు సి గ్రేడ్కు, 146 మంది డి గ్రేడ్లో ఉన్నారని వారికి గ్రేడ్ల వారీగా ప్రత్యేక శిక్షణలు ఇస్తూ అదనపు తరగతి గదులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు అదనపు తరగతి గదులు నిర్వహించి, వారికి ఏ ఏ సబ్జెక్టులలో ఇబ్బందిగా ఉందో తెలుసుకుని వారికి ఆ సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు మెరుగైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏదేమైనప్పటికీ మార్చి 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్ష ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతే తమ లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పెనుగొండ : విద్యార్థి ఆర్థికంగా వెనకబడడంతో చదువును కొనసాగించాలని ప్రోత్సాహం అందించామని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రమణ అన్నారు. ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ముత్యాల హిమబిందు పెనుగొండ ఎస్వీకేపీ ఎస్విబిపి, పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో గత సంవత్సరం ఇంటర్మీడియట్ కాలేజీ ఫస్ట్ వచ్చింది. తాను ఆర్థిక ఇబ్బందులతో డిగ్రీ చదవలేక ఖండవల్లి రవళి స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తుంది. ఈ విషయాన్ని కొంతమంది ములపర్రు గ్రామానికి చెందిన బివి.రమణ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు అయిన కానిస్టేబుల్ బివి.రమణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఆయన స్పందించి డిగ్రీ చదవడానికి కావలసిన ఆర్థిక సహాయం అందిస్తానని చెప్పి తన గురువు డిసి హనుమంతరావు దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే ఆయన రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో హిమబిందు మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ రమణకి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు.

10న జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం

మొగల్తూరు : పిల్లలందరికీ నులి పురుగు నివారణ మాత్రలు విధిగా వేయాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని సూచించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యులు ఒ.దినేష్ కుమార్ అధ్యక్షతన నులిపురుగు నివారణ దినోత్సవ గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం నిండిన చిన్నారి నుంచి 19 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరూ నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు కె.లక్ష్మీపార్వతి, యు.సామ్యూల్ జాన్, సిడిపిఒ బి.ఊర్మిళ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎన్ఎన్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 10వ తేదీన జరుగు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. ఎంఇఒ వీరస్వామి, ఇఒపిఆర్డి తాళ్ల మూర్తిబాబు, పిహెచ్ఎన్పి ఎలిజిబెత్ పాల్గొన్నారు.

ఘనంగా నరసింహారావు జయంతి

తణుకు : వామపక్ష భావాలు, గాంధీజీ స్వాతంత్ర ఉద్యమంలో, సుభాష్చంద్రబోస్ సహచర్యంలో ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులుగా, లోక్నాయక్ జయప్రకాష్ సహచరునిగా బహుకోణాలను తనలో ఇముడ్చుకుని, సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి యర్రమిల్లి నరసింహారావు అని ప్రముఖ సామాజికవేత్త, దారిదీపం సంపాదకులు డివివిఎస్.వర్మ కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా సమరయోధుల పార్కులో ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, మనోరమ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామం డోర్ నెంబర్ 9-125 కి చెందిన నర్రా సోమరాజు, తండ్రి: నర్రా శ్రీను అను నేను ది. 3-2-2025 వ తేదీన **డాక్యుమెంట్స్ నెం. 81/1998, 269/1994** గల దస్తావేజులను తీసుకొని వెళుతుండగా సుమారు 11 12 గంటల సమయంలో గూటాల నుండి పోలవరం బండి మీద వెళుతుండగా కవర్లో ఉన్న సదరు దస్తావేజులు పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

నర్రా సోమరాజు
తండ్రి: నర్రా శ్రీను
డోర్ నెంబర్ 9-125,
గూటాల, ఏలూరు జిల్లా
సెల్: 89859 92449

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, కోటపాడు గ్రామానికి చెందిన చీపు రాంబాబు, S/o చెన్నారావు కు సంబంధించిన **సర్వే నెం. 330/B** నకు **దస్తావేజు నెం. 3322/2012** దానికి సంబంధించిన **లింకు దస్తావేజు నెం. 927/2009** మరియు **సర్వే నెం. 288/2** కు సంబంధించిన **దస్తావేజు నెం. 3673/2010** దానికి గల **లింకు దస్తావేజు నెం. 1368/1956** లు గల దస్తావేజులు కోటపాడు గ్రామం నుండి చాట్రాయికి జిరాక్స్ల కోసం ది. 5-02-2025 తేదీన ద్విచక్ర వాహనం పై వస్తూ ఉండగా మార్గమధ్యంలో జారి పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

చీపు రాంబాబు
S/o చెన్నారావు
కోటపాడు గ్రామము,
చాట్రాయి మండలం
సెల్: 90008 71607

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.17/2023

Between:
నల్లం సురేష్ ...పిటీషనర్
Vs
1: అల్లాడి లక్ష్మి
2: కొమర సుమన
3: కొమర తనూజ దుర్గా గాయత్రి
4: అఫీషియల్ రిసీవర్, ఏలూరు ...రెస్పాండెంట్స్

ప్రకటన

పై నంబరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని మరియు ఇతర పరిహారముల నిమిత్తము పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో పై రెస్పాండెంట్లుతో ఆస్థులపై లావాదేవీలు జరపరాదని, చెల్లివని ఇందు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది. సదరు వాయిదా **తేది. 14-02-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పిటీషనులో కోరిన పర్యవసానములు మీ పరోక్షణమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)
సిరిపురపు రాజేశ్వర ప్రసాద్
నరసాపురం అడ్వకేట్
ది.05-2-2025 నరసాపురం, ప.గో.జిలా
సెల్ నెం. 93941 76662